# నిమ్మయ్య - ధర్మయ్య

శ్రీ సి. సి. పున్నయ్య

ఆయనను ఆ యూళ్లో ఆరణాల మూడణాల నిమ్మయ్య అని పిన్నలు, పెద్దలు వెంటబడి బజారులలో పిలుస్తూ గోలచేస్తుంటే చీకాకుతో వారిని తిడుతుండేవాడు, కొట్టబోయేవాడు. అయినా నవ్వుకుంటూ ఆయన కనుపించినప్పుడల్లా వెంటబడుతుండేవారు. నిమ్మయ్య ఎవరో, ఎక్కడినుండి ఆ గ్రామానికివచ్చి స్థావరమేర్పరచుకున్నాడో ఎవరికీ తెలియదు. ఆయన ప్రతిదినం ఉదయం భిక్షాటనమునకు యూళ్ళో తిరిగేవాడు. పెళ్ళిళ్ళలాంటి శుభకార్యాలు జరిగే చోట్లకు, పితృకర్మలు జరిగేచోట్లకు సంభావనకని, భోజనానికని వెళ్ళుతుండేవాడు. తృణమో, ఫణమో యిచ్చింది తెచ్చుకునేవాడు. కాని పాపం తన సంచిలో దాచుకున్న బియ్యాన్ని, డబ్బులను ఎవరో ఒకరు దోచుకుంటుండేవారు. అలా పోగొట్టుకున్నప్పుడు పసిపిల్లవాడిలాగ వెక్కి వెక్కి ఏడ్చేవాడు. కాని పోయినవే అనే బెంగతో కుప్పకూలిపోయేవాడు కాడు. అతనిని చాలమంది పిచ్చివాని క్రింద, వెర్రివానిక్రింద జమకట్టేవారు. ఎవరేమనుకుంటున్నా ఆయన లక్ష్యపెట్టేవాడు కాడు. ఆయన వల్ల ఏదైనా పరుల కుపకారముండేదేగాని అపకారమంటూ యుండేదికాదు. ఎవరితోను అతిగా మాట్లాడేవాడు కాదు. పరిమితంగా ఎప్పుడైనా ధోరణిగా భగవత్, పారమార్థిక చింతలను గురించి నడమంత్రపు లోకంపోయే వింత పోకడలను గురించి మాట్లాడుతుండేవాడు. ఉదయం భిక్షాటనంచేసివచ్చి శ్రీ సాయిబాబా ఆలయం ఆవరణలోని బావి దగ్గర స్నానంచేసేవాడు. బాబా సాన్నిధ్యంలో గంటలు తరబడి ధ్యానసమాధిలో గడిపేవాడు. మామిడిచెట్టుక్రింద వంట చేసికొని భగవదార్పితంచేసి తాను భుజించేవాడు. రాత్రిళ్లు పగలు వండుకున్నది మిగిలితే తినేవాడు; లేకపోతే నిరాహారిగానే పడుకునేవాడు. ఆ ఆలయంలో పూజ, దీపారాధనల నిర్వహిస్తున్న ధర్మయ్య నిమ్మయ్యకు అత్యంత ఆప్తుడు. వారిరువురు సాయిబాబాను లోకకళ్యాణాన్ని, ప్రజల శ్రేయోసౌభాగ్యముల నుద్దేశించి ఆరాధించి, బాబా విభూది ప్రసాదములను, ఆశీస్సులను ప్రతి గురువారం అక్కడ గుమికూడే అశేష ప్రజానీకానికి పంచిపెట్టేవారు. ధర్మయ్య త్యాగసేవాసక్తి, భగవత్ చింతలు ప్రజలలో నిరంతరము పారమార్థిక చింతను, భక్తి ముక్తి మార్గాలను, సౌశీల్యమును ప్రబోధించుచుండేవి. బాబా సన్నిధిలో ధర్మయ్య చేతి విభూది వేలకొలది ప్రజలకు శారీరక, మానసిక వ్యధలను బాబా అనుగ్రహమువలన స్వస్థతపరచేవి. ధర్మయ్య నిరాడంబర జీవి. సత్యశీలుడు. స్వార్థత్యాగి. మానవసేవ నిమిత్తము తన జీవితమును అంకితముచేసినవాడు. ఆయన దృష్టిలో అందరు సమానులే. అధికార ఆధిక్యతల కతీతంగా పీడిత మానవకోటికి వారి సౌభాగ్యము నుద్దేశించి శక్తివంచనలేకుండా బాబా ఆశీస్సుల నందిస్తూ సేవచేయడమే ధర్మయ్య పవిత్ర లక్ష్యము. ధర్మయ్య, నిమ్మయ్య ఒక యూరివారేమో ననుకునేవారా ప్రాంతీయులు కొందరు. మొత్తంమీద చాలకాలం వారిద్దరి పూర్వచరిత్ర ఎవరికీ తెలియదు. నిమ్మయ్య చనిపోయాడా గ్రామంలోనే. ధర్మయ్య ఆయన శవాన్ని ఆలయ ఆవరణలోనే సమాధిచేయించి నిత్యదీపారాధనతో పూజాపుష్పాలు భక్తి విశ్వాసాలతో అర్పించసాగాడు. అదిచూచి ప్రజలు మరీ వింత పడసాగారు. నిమ్మయ్య, ధర్మయ్యలకు పూర్వసంబంధమేదో యుండియుండాలనియు, వారి పూర్వచరిత్రను తెలిసికోవాలని భక్తులకు ఆసక్తి ఎక్కువయింది. దాని కనుగుణ్యంగా ఒక చిన్న పుస్తకంవ్రాయ పూనుకున్నాడు యిలా—

"ఒకప్పుడు మాకు ఆస్థిపాస్తులు విశేషంగా నుండేవి. దాన్ననుసరించి మా నాన్న సంసారాన్ని దర్జాగా, దర్పంతో నడిపించేవాడు. నేను ఒకొక్కతరగతిలోను రెండు మూడుసార్లు దండయాత్రలు చేసినా బోలెడంత డబ్బు వెదజల్లి చదువు చెప్పించి నేను బి. ఏ. అనిపించాడు. మా అక్కకు, చెల్లెళ్లకు గొప్పగా కట్నాలిచ్చి వైభవంగా వివాహం చేశాడు. మా నాన్న మహారాజా పోకడలకు మా ఆస్తిపాస్తులు కర్పూరంలాగ కరిగిపోయినవి. మా నాన్నకు వయస్సుమీరింది. నాకు ఆశించినట్లు పెద్ద

ఉద్యోగమేది లభించలేదు. ఒక ఫ్యాక్టరీలో చిన్న గుమాస్తాగిరి దొరకడమే గగనమయింది. ఆదాయం స్వల్పం. ఖర్చుతగ్గినదేమి లేకపోయేసరికి చుట్టూ అప్పులు పెరిగిపోసాగినవి. ఆస్థిపాస్తులు సన్నగిల్లినా, ఆదాయం చెప్పుకోతగ్గది కాకపోయినా మా నాన్నకు మునుపటి మంచిరోజులనాటి ఠీవి, దర్జాలమీద ఆసక్తి తగ్గిందికాదు. మునుపటిలాగే దాసదాసీజనం, రోజూ నాలుగయిదు సార్లయినా కాఫీఫలహారాలు, వచ్చేపోయే బంధువుల రామంథాళి - వీటికని అవకాశమున్నచోటునల్లా అప్పుచేసేవాడు. కాని ఆ యప్పులు తీర్చడానికి ఎటుపారచూచినా అవకాశాలు శూన్యం. క్రమంగా అప్పులవాళ్ళ ఒత్తిడి అధికమయి మా నాన్న భయపడి యిల్లు కదలడం మానేశాడు. నా స్వల్ప ఆదాయం మా నాన్న దర్జాల ముందర ఆగేదికాదు. ఒక కాని డబ్బు అప్పుకూడ వూళ్ళో అస్కారంలేకపోయింది. భోజనానికి జరుగుబాటు సయితం కటకటలాడసాగింది. జీతం, బత్యంలేకుండా ఎంతకాలమని వెట్టిచాకిరి చేయగలమని యింట్లోపని వాళ్ళు నిలిచిపోయారు. పాలవాళ్ళు, నెయ్యివాళ్ళు కాయగూరలవాళ్లు తమ కెప్పటినుంచో యివ్వాల్సి యున్న పైకమునకు కాలిన బలపము కట్టుకొని తిరుగుతుంటే యూళ్ళోని చిన్న, పెద్దకూడ అనేక రకాలుగా మా నాన్నను గురించి, మా కుటుంబాన్ని గురించి మాట్లాడుకుంటుండేవాళ్లు. నాకది అవమాన మనిపించినా నేను చేయకలిగినది ఏమిటో బోధపడేదికాదు.

నేను ఆఫీసుకు పోతూవస్తుండేవాడినే కాని అంతా నాకు అయోమయంగా నుంటుండేది. నారాయణస్వామి మా ఆఫీసులో అటెండరుగా, నుంటుండేవాడు. నన్ను, నా కుటుంబ పరిస్థితులను క్రమంగా అర్థంచేసికోకలిగాడు. దైవికంగా అతనికి నా పట్ల ప్రత్యేకమైన ఆసక్తి, సానుభూతి ఏర్పడినవి. మా కుటుంబ జీవయాత్రలో పొయిమీదికి, పొయిక్రిందికి లేని రోజులు ఎన్నో గడుస్తుండేవి. మేము తిన్నామో, తినలేదో మా చుట్టూయున్న అయినవారికి, కాని వారికీకూడ తెలిసికోవాలనే అగత్యముండేదికాదు. ఆఫీసులో నా వాలకాన్ని చూచి నారాయణస్వామి మాత్రం సానుభూతి చూపేవాడు. ఆయన పదులు, యిరవైలు యిస్తేనే మేము గంజిత్రాగిన రోజులు చాల యున్నవి. నాకు నిస్పృహా నిరాశ లావరించినప్పుడు ఆయన ఓదార్పే నాకు ఆత్మవిశ్వాసాన్ని, బలాన్ని సమకూరుస్తుండేవి. నాకాయన అలా ఎంత డబ్బిచ్చాడో ఆయనకు లెక్కుంటూలేదు; నాకు బాగా జ్ఞాపకములేదు.

నారాయణస్వామికి ఆఫీసులో జీతం స్వల్పమయినా పిల్లజల్లలేదు. భార్య పాడిచేసిపాలు, పెరుగు, నెయ్యి అమ్ముతుంది. విస్తళ్లుకుట్టి, అప్పడాలు, వడియాలుచేసి అమ్ముతుంది. నారాయణస్వామి జీతంతో పాటు భార్య కృషివల్ల సమకూరే ఆదాయింతో ఒడిదుడుకులు లేకుండా సంసారం గడుపటమే కాకుండా నాలుగు డబ్బులు మిగుల్చుకునే స్థితివారిది. నారాయణస్వామి నాకవసరంవచ్చినప్పుడల్లా వెనకేసుకున్న డబ్బులోనుండి అయాచితంగా నాకిస్తుండేవాడు. అంతే తనిచ్చిన డబ్బును తనకివ్వమని నన్ను అడిగి ఎరుగడు.

జీతబత్యాలు లేని కొలువంటూ మా యింట్లోని పనివాళ్లు చాలించుకున్నారు. మాయింట్లో ఆడవాళ్లు ఎవరూ బావిదగ్గరకు పోయి నీళ్లు తెచ్చి ఎరుగరు అంతవరకు. పనిమనుషులు చాలించుకునేసరికి యింట్లో బండెడు చాకిరి ఎవరుచేసేటట్లు? మా అమ్మగువ్వలాగ యింట్లో ఒక మూల కూర్చున్నది. మా చెల్లెళ్లు తమకేమి సంబంధములేనట్లు నిద్ర ముఖాలతో వాల్చినమంచాల మీద బయిటాయించారు. ఇంట్లో చెంబెడు నీళ్లులేవు - అంట్లతప్పాలలు, చెంబులు ఎవరు తమ్ముగమునించలేదేమో యన్నట్లు వంటయింట్లో పడియున్నవి. ఇల్లు చిమ్మటానికైనా ఎవరికీ ఆసక్తి కనుపించలేదు. ప్రొద్దుపొడిచేసరికి కాఫీనీళ్ళకు తపించి పోయే మా నాన్న, అమ్మ, చెల్లెళ్లు అవకాశం ఎలాగూలేదుకాబట్టి కాబోలు కుక్కినపేనులలాగ యూరకున్నారు. ఇదంతా చూస్తున్న మా ఆవిడ బిందెచంకనబెట్టి నీళ్ళకు బావికి బయలుదేరింది. మా నాన్న అదిచూచి "పంతులుగారి కోడలివైయుండి నీవు నీళ్ళకు పోవడం నా పరువు ప్రతిష్టలను మంటకలుపడానికా!" అని గర్జించాడు.

మెల్లగా మా ఆవిడ "ఇందులో అప్రతిష్టకేమున్నది మామగారూ! మనయింటిపనులను మనం చేసికోకపోతే మరెవ్వరుచేస్తారు!" అంటూ వెళ్ళి నాలుగు బిందెల నీళ్లు తెచ్చి, అంట్లు, చెంబులు తోమి. కాఫీపెడ్తున్నంతసేపు మా నాన్న ఏదో సణుగుతునేయున్నాడు. అందరికి లోటాలలో కాఫీ పోసియిచ్చి, తాను త్రాగి కాఫీ సామానులను కడిగి గుడ్డలుతకసాగేసరికి మా చెల్లెళ్లు ఒకరి ముఖంమరొ

కరు చూచుకుని మంచాలు ఎత్తి, చిమ్మడానికి చీపురు చేత బట్టింది ఒక చెల్లెలు. మరొకతె మా అవిడ గుడ్డలుతుకుతుంటే పిండి ఆరెయ్యసాగింది. మా అమ్మ లేచి లేవలేనట్లు స్నానంచేసి మంచినీళ్లు తేవడానికి బావికివెళ్ళింది. ఆనాటినుండి తలా ఒకపని చేసికోసాగడం వలన పనివాళ్ళ అవసరం తీరిపోయింది.

మా ఆవిడకు నారాయణస్వామి భార్యతో పరిచయ మేర్పడింది. నారాయణస్వామి భార్య దగ్గర విస్తళ్లుకుట్టడం, జాకెట్లు, రవికలుకుట్టడం నేర్చుకున్నది. దొడ్లో కూరగాయిల చెట్లను పెంచి కాయలను మార్కెట్టుకు పంపి అమ్మించ నారంభించింది. ఈ విధంగా కొంత ఆదాయం రాబట్టి బియ్యం, ఉప్పు, పప్పులాంటి సామానులు తెప్పించి సంసారము దిద్దసాగేసరికి మా నాన్న విస్తుపోయాడు. తనకు, తన కుటుంబప్రతిష్టకు అదిలోపమని వాపోయాడు. కాని కనీస జీవితావసరాలైన తిండికి, గుడ్డకు, కాఫీకి అలమటిస్తున్న రోజులలో కోడలు ఆ మాత్రం తెంపుచేసి వేళకు తిండికి, కాఫీకిలోటులేకుండా చేస్తుంటే కాదని, వద్దని తాను చేయగల ఘనకార్యమేమి కనపించలేదు. కుటుంబభారాన్ని మాఆవిడ నాతోబాటు కొంతమోయసమకట్టడం నాకు కొంతమతిస్థిమితాన్ని కలుగజేసింది. మా ఆవిడపడుతున్నశ్రమకు, చేస్తున్న త్యాగమునకు నేనెప్పుడైనా అభినందిస్తే "అదేమిటండీ! యిందులో నా ఘనత ఏముందీ! సంసారభారమన్న తరువాత భార్యభర్తలిదరు వహిస్తేనే కుటుంబ సౌభాగ్యంసమకూరుతుంది" అంటుండేది.

కొంతకాలానికి నారాయణస్వామి భార్యకు జబ్బుచేసి ప్రమాదావస్థకుగురియయింది. చికిత్సచేయించడానికి డబ్బులేక నారాయణస్వామి యిబ్బందిపడసాగాడు. ఎక్కడెక్కడో ఎంతగానో ప్రయత్నం చేసాడు. కాని బీదవాడి అవసరాలను, కష్టాలను గుర్తించి సానుభూతితో ఆదుకునేవాళ్లు బహుఅరుదు. నాకుటుంబ పరిస్థితులు తెలుసుకాబట్టి నా కెంతనో దబ్బిచ్చియున్న ఆయన నన్ను అడగడానికి మొగమాటపడ్డాడు. నేనే "స్వయంగా నారాయణస్వామీ! ఏదో డబ్బుకు యిబ్బంది పడుతున్నట్లున్నదినీవు — ఎల్లుండి ఉదయానికి నీకు ఎంతకావలసియుంటే అంతయిస్తాను. బెంగపడవాక" అన్నాను చిన్నమహారాజులాగ.

"ఎంతో ఎందుకు బాబూ! వందరూపాయలు చాలు. దాంతో మా ఆవిడను చికిత్సకు మద్రాసుకు తీసికెళ్దామని" అన్నాడు

"అలాగేలే". అన్నాను ఫైల్సులో కాగితాలను సర్దుతూ.

మరునాడు నాకు ఆఫీసులో రాత్రిడ్యూటీ. నేను మరొకగుమాస్తా, మేనేజరు మాత్రమే యున్నాం. ఆఫీసులో నేను టేబిలు ముందుకూర్చొని ఫైలుతిరుగవేస్తున్నానేకాని నారాయణస్వామి తన భార్యకు చికిత్సకని డబ్బులేక పడుతున్న యిబ్బంది కనులలో మెదలుతున్నది. నాకు నారాయణస్వామి చేసిన సహాయమునకు నేను అతని అవసరాన్ని తీర్చలేకపోతే ద్రోహం అనుకున్నాను. నేను మరునాటి ఉదయానికి నూరురూపాయలు తెచ్చియివ్వలేకపోతే నారాయణ స్వామికి నేను అసమర్థులలో జమయని అంతర్వాణిఘోషించసాగింది. మెల్లగాలేచి మేనేజరుగది తలుపుత్రోసుకొని లోనికి వెళ్లాను. మేజామీద ఇనుపెట్టె తాళాల గుత్తియున్నది. మేనేజరు కుర్చీలో కూర్చునేకునికి పాట్లు పడుతున్నాడు. నేను వెళ్ళగానే కళ్లుతెరచి "ఏం! ఎందుకువచ్చావు? ఏంపనిలేదా" అన్నాడు చేతిరుమాలుతో మూతితుడుచుకుంటూ.

"పనిలేకేంసార్! — నాకు అత్యవసరంగా నూరు రూపాయలు కావలసివచ్చింది. దాన్ని మీరుయిచ్చి నాలుగునెలలలో నా జీతంనుండిరాబట్టుకుంటే చాల మేలుచేసిన వారగుతారు" అన్నాను ప్రాదేయపూర్వకంగా.

"ఏమిటీ! — నూరురూపాయలా! నీకివ్వడానికి నేనిక్కడ కువ్వాలుపోసుకొని కూర్చునియుండలేదు. పోయి పనిచూచుకో" అన్నాడు ముఖంచిట్లిస్తూ మేనేజరు.

"అలాగంటే ఎలాగసార్! అత్యవసరపరిస్థితులు కాబట్టే మిమ్ములనింతగా ప్రాధేయపడుతున్నాను - దయయుంచండి" అన్నాను.

"నీకుకదూ చెప్పేది! పో! ముందుబయటికి" అంటూ లేచాడు. నేనక్కడనుండి కదలలేదు. నన్ను మెడబట్టి బయటికి నెట్టాలని నాపైకురికాడు. మా యిద్దరి పెనుగులాటలో మేనేజరు అక్కడున్న ఇనుపబెంచిమీదపడి దానిమూల కణతకుదిగబడి బలనగాయంతగిలి స్పృహతప్పిక్రిందవాలాడు. గాయంపైనుండి రక్తము బొళబొళ కారసాగింది. నాకు కాళ్ళు, చేతులు గజగజవణికినవి. మరునాడుదయం ఎలా

గైనా నారాయణస్వామికి వందరూపాయిలిచ్చి ఆదుకోనితీరాలని జ్ఞాపకానికి వచ్చింది. మేజామీది యినుపపెట్టె తాళాల గుత్తి నన్ను ఆహ్వానిస్తున్నట్లుగా తోచింది. దాన్ని లంకించుకొని యినుపపెట్టె తెరచాను. అందులోని కట్టలుగానున్న నోట్లు నాకు దిగ్భ్రమకలిగించినవి. నారాయణస్వామి నాదుకోడానికి కావలసిన నూరురూపాయలు తీసికొని పెట్టెతాళంవేసి తాళాలగుత్తిని యధాస్థానంలో నుంచి గదినుండి బయటపడ్డాను. నాతోబాటు డ్యూటీకి వచ్చిన గుమాస్తా యీ గొడవతోటి తన కేమి ప్రమేయము లేనట్లు కుర్చీలో కూర్చుని టేబిలు మీద తలవాల్చి నిద్రపోతున్నాడు.

మేజామీది కాగితాలన్నీ గబగబ సర్దేసి చడీ, చప్పుడులేకుండా ఆఫీసువదలిపెట్టి యిల్లు చేరాను. మరునాడు ఉదయం నా దగ్గర నూరురూపాయలు తీసికొని నారాయణస్వామి భార్యా సమేతంగా చికిత్సకు మద్రాసుకు బయలుదేరి వెళ్ళాడు.

నారాయణస్వామి మద్రాసులో భార్యకుచికిత్స చేయిస్తూ పదిహేనురోజులున్నా ఆమె ఆరోగ్యం క్షీణించిందేకాని మెరుగుకాలేదు. చివరకు వ్యాధి ముదిరి ఆమెచనిపోగా నారాయణస్వామి గంపెడు చీకటి నెత్తినవేసికొని వచ్చి యిల్లుచేరాడు. వచ్చీ రాగానే మా యింట్లోమేము కనుపించకపోయే సరికి చుట్టు ప్రక్కలవాళ్ళను విచారిస్తే నేను మేనేజరును హత్యచేయసమకట్టానని, ఆఫీసు యినుపపెట్టెలోనుండి డబ్బుదోచుకొని వెళ్ళాననీ, అందుకుగాను నాకు పదిసంవత్సరాలు జైలు శిక్ష విధించబడిందని, కుటుంబము అప్పులపాలుకాగా యిల్లు వాకిలు అప్పులవాళ్ళ పరమయి తలదాచుకోడానికి కూడ స్థలములేక నావాళ్ళంతా చెట్టుకొకరు, గుట్టకొకరు అయిపోయినారని చెప్పారు. అదివినగానే నారాయణస్వామికి తన భార్యకు చికిత్సకుగాను నూరురూపాయలు కావలసి ఏర్పడిన పరిస్థితులు, అందుకుగానే నేను సాహసించియుంటానని మనసుకు తట్టి తనమూలంగా కదా నాకుటుంబము మొత్తము నామరూపాలు లేకుండా పోయిందని భోరున ఏడ్చాడు. మతిభ్రమించింది. అప్పటినుండి ఎక్కడా నిలకడగానుండకుండా తిరుగుతూ పిచ్చివాడని, వెర్రివాడని అనిపించుకుంటూ చివరకు యిక్కడికి వచ్చి బాబాసాన్నిధ్యం చేరాడు.

పదీ సంవత్సరాల శిక్ష ముగిసి బయటికిరాగా నాకు శూన్యంమిగిలింది. మా అమ్మ, నాన్న చనిపోయారు. నా భార్య ముక్తిమార్గాన్ని అన్వేషిస్తూ వైరాగ్యంతో ఎక్కడికిపోయిందో ఎవరికీ తెలియదు. నాకు ఎలాటి బాదరబందీలులేవు. ఆత్మ, పరమాత్మల ప్రేరేపణతో శ్రీ బాబా ఆరాధనకు, మానవసేవకు ఉపక్రమించాను యీ గ్రామంలో. నారాయణస్వామియే నిమ్మయ్యఅని నాకు తెలుసు; కాని నన్నుమాత్రం మతిభ్రమచే నిమ్మయ్య గుర్తించగలస్థితిలో లేడు జీవితాంతమువరకు"

మెదడును చల్లబరచి
శిరోజములను నల్లబరచి
కుదుళ్లను పదిలము చేయునది

కేసరిగారి

భృంగామలకతైలము

వెల రు. 2

కేసరి కుటీరం ప్రైవేటు లిమిటెడ్

రాయపేట, మద్రాసు 14.